చేతిపంపులే ఆధారం

- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు
- నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చిన్నంబావి: తాగునీరు లేకుంటే ఏ జీవి మనుగడ సాధించలేదు. ఎండలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో గ్రామాల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేతిపంపుల మరమ్మతులకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో వినియోగించిన వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన పంచాయతీ అధికారులు ప్రజల అవసరాలకు అనుగుణంగా చేతిపంపులకు మరమ్మతు చేస్తూ వినియోగంలోకి తీసుకోస్తున్నారు. దీంతో నీటి సమస్యను పరిష్కరించేందుకు కొంత మేర ఉపయోగపడుతున్నాయి.

వినియోగంలోకి చేతిపంపులు..

మండలంలోని 17 గ్రామాల పరిధిలో 59 చేతిపంపులు ఉన్నాయి. గతంలో ఇవి ఆయా గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగపడేవి. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ, బోరు బావులు నుంచి నీటి సరఫరా ఉండటంతో చేతిపంపుల వాడకం తగ్గిపోయింది. ఫలితంగా వాటిల్లోని పైపులు తప్పు పట్టడం, విరిగిపోవడంతో 33 చేతి పంపులు పనికి రాకుండా పోయాయి. ఈ వేసవిలో గతంలో ఎన్నడూ లేనంతంగా నీటి సమస్య తలెత్తుతోంది. కొత్తగా బోర్లు వేసే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు మళ్లీ చేతి పంపులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల విజ్ఞప్తి మేరకు పంచాయతీ అధికారులు మళ్లి చేతి పంపులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 25 చేతిపంపులను మరమ్మతు చేశారు.


పెద్దమార్‌లో చేతిపంపు మరమ్మతు చేయడంతో నీటిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

మిషన్ భగీరథ అమలుతో..

గతంతో గ్రామాల్లో మిషన్ భగీరథ, బోర్లు లేని సమయంలో చేతి పంపులే గ్రామస్తుల నీటి అవసరాలను తీర్చాయి. బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర కారణాల చేత చాలా గ్రామాల్లో చేతి పంపులపైనే ఆధారపడేవారు. ఇంటింటికీ తాగునీరు అందించే క్రమంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం రావడంతో చేతిపంపులను ఆయా గ్రామాల ప్రజలు పూర్తిగా మరచిపోయారు. కానీ ఇప్పుడు చేతిపంపులే మళ్లీ ఆధారమయ్యాయి.


పెద్దమార్‌లో చేతి పంపు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కాస్త ఉపశమనం



పెద్దమారు గ్రామంలో ఎన్నడూ లేనంతగా ఈసారి తాగునీటి ఎద్దడి ఏర్పడింది. సమస్యను మంత్రి జూపల్లి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చేతి పంపులకు వెంటనే మరమ్మతు చేశారు. దీంతో గ్రామంలో చాలా వరకు తాగునీటి సమస్య తీరింది. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం.

– రాజ్‌కుమార్, పెద్దమారు

ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం

- ఆందోళనలో అన్నదాతలు
- బుసిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో తూకం కాని వరి ధాన్యం

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. చేతికందిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 15 రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలకు వచ్చిన ధాన్యం జాప్యం చేయకుండా తూకం చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా మండల స్థాయి అధికారులు మాత్రం వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అకాల వర్షాల భయం వెంటాడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం తూకం విషయంలో అధికారులను ప్రశ్నిస్తే సమీపంలో ఉన్న మరో కేంద్రంలోకి ధాన్యం తీసుకవెళ్లండని సలహా ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


బుసిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన వరి ధాన్యం

వడదెబ్బ బారిన పడొద్దు: వైద్య సిబ్బంది

పాన్‌గల్: వడదెబ్బ తగలకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. శుక్రవారం మండలంలోని శాగాపూర్‌లో ఆమె వైద్య సిబ్బందితో కలిపి పర్యటించి వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓఆర్ఎస్ పాకెట్లను ఒక లీటర్ నీటిలో కలుపుకొని తాగాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున బయటికి వెళ్లొద్దని, అత్యవసర సమయంలో బయటికి వెళితే టోపి, గొడుగు, రుమాలు తప్పక ధరించాలని సూచించారు. ఎక్కువ నీళ్లు తాగుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు ఉదయం వేళల్లో తొందరగా పనులకు వెళ్లి మధ్యాహ్నం సమయంలో త్వరగా ఇంటికి చేరుకోవాలన్నారు.


ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం సుమిత్ర

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: ఎండల తీవ్రత కారణంగా నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని దావాజిపల్లిలోని నర్సరీలను పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. గ్రామంలోని చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులను ఆయన పరిశీలించారు. పనులకు వచ్చే రోజు వారీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద నీడ, నీటి వసతిని తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


ఒండ్రు మట్టి తరలింపు పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సత్యం గౌడ్ తెలిపారు. కమాలోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన ఎమ్మె రాములు తన ట్రాక్టర్‌లో ఇసుక నింపుకుని గ్రామం నుంచి శుక్రవారం ఉదయం తిర్మలాయపల్లికి తరలిస్తున్నాడు. పూర్తి సమాచారంతో తనిఖీ చేసిన పోలీసులు తిర్మలాయపల్లి శివారులో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సీజ్

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆముదంబండతండాలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. గురువారం రాత్రి సమయంలో పక్కా సమాచారంతో తండాకు వెళ్లి మద్యం విక్రయిస్తున్న కేతావత్ కిషన్ ఇంట్లో సోదాలు చేశామన్నారు. ఈ సోదాల్లో నాలుగు కాటన్ల బీర్లు దొరికాయని తెలిపారు. మద్యం సీజ్ చేసి కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రామన్‌పాడులో వైద్య శిబిరం ఏర్పాటు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో ప్రజలు జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతుండడంతో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దోమలు నియంత్రణ కోసం స్థానిక వైద్యాధికారి భవాని సిబ్బందితో పైత్రిం మందులు పిచికారీ చేశారు. జ్వరపీడుతులకు ఆరోగ్య సమస్యలు అధికంగా ఉంటే వెంటనే స్థానిక ఆస్పత్రిలో వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. గ్రామస్తులందరికీ జ్వరం, కీళ్ల నొప్పులు పూర్తిగా తగ్గించే వరకు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పరిసరాలు, నీళ్ల సంపులు, ఖాళీ హౌజులను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేష్, నర్మద, చెన్నమ్మ, ఆశాలు పాల్గొన్నారు.


రామన్‌పాడులో పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

క్షయ నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల, అన్నారం, మాందాపూర్, దొండాయిపల్లి గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసి 41 మంది అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం శ్లైను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలి, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, రేవతి, నిర్మల, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అన్నారంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం

ఆత్మకూర్: జాతీయ ఉపాధిహామీపథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరేపల్లిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ నిధుల్లో కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెగ్యూలర్‌గా వేతనాలు చెల్లిస్తామని చెప్పిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు నెలలో మొదటి రోజు వేతనాలు చెల్లిస్తుందని గొప్పలు చెబుతున్నా ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఆరు నెలలు కావస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు అందించాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి రెగ్యూలరైజ్ చేయాలని, విధి నిర్వహణలో మరణించే కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.


మాట్లాడుతున్న రాము

'ఖిల్లా'లో హోం ఓటింగ్

ఖిల్లాఘనపురం: మండలంలో శుక్రవారం అధికారులు హోమ్ ఓటింగ్ చేపట్టారు. ఎన్నికల అధికారి మల్లికార్జున్, ఆర్ఐ గణేష్‌తో పాటు సిబ్బంది శుక్రవారం మామిడిమాడ, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, తిర్మలాయపల్లి, కమాలోద్దీన్‌పూర్, వెంకటాంపల్లి గ్రామాల్లో ఇంటి వద్దనే ఓటింగ్ నిర్వహిస్తున్నారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే నేరుగా వెళ్లి కుటుంబ సభ్యుల్లో ఒకరి సహకారంతో ఓటు వేయిస్తున్నట్లు ఎన్నికల అధికారి చెప్పారు. మండలంలో మొత్తం 45 మంది ఓటరు ఉండగా శుక్రవారం 16 మంది ఓటర్లతో ఓటు వేయించారు. అన్ని గ్రామాలు తిరిగి 100 శాతం ఓట్లు వేయించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.


హోమ్ ఓటింగ్ నిర్వహిస్తున్న ఎన్నికల ఇన్‌చార్జ్

అండగా ఉంటాం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డుకు చెందిన గోర్ల తిరుపతి కొంతకాలంగా పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నాడని స్థానిక నాయకుడు ఆటో రాజు ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, కౌన్సిలర్ వెంకటేష్ తిరుపతిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాని మేఘారెడ్డి అండగా ఉంటాడని సూచించి భయపడొద్దని ధైర్యం చెప్పారు. అదేవిధంగా పాతబజార్‌లో అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు బొంబాయి మన్నెంకొండ, పీడీ జయనందం, సురేష్, బషీర్, శశాంక్ సాగర్, విశ్వం, రాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు

వనపర్తి: బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఏకైక మహిళా ఇంజినీరు బి.రవళి శుక్రవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో చిన్నారెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈమె వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలంలోని అమ్మపల్లికి చెందిన వారు కావటం విశేషం. గతంలో హైదరాబాద్ మెట్రోలైన్ ప్రాజెక్టులో పనిచేశారు.

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలోని పెబ్బేరు, శ్రీరంగాపురం, పెద్దమందడి, వనపర్తి మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎంఎల్‌సీ కోదండరెడ్డి సమక్షంలో సుమారు వెయ్యి మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏబీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొని బుచ్చారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గొని కొండదరామిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములు యాదవ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సివిల్ ఇంజినీరు బి.రవళి

సైబర్ నేరాలపై అవగాహన

పాన్‌గల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వేణు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరగాళ్లతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల నిషేధం, ట్రాఫిక్ నిబంధనలు, వేసవి కాలంలో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు, ఆధార్ వివరాలను తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితులలో చెప్పకూడదన్నారు. అమ్మాయిలను మగ పిల్లలతో సమానంగా చదివించాలని, చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్టారీత్యా నేరం అన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వేణు

బ్యాంక్ ఉద్యోగికి సన్మానం

వనపర్తిటౌన్: సాధించాలని లక్ష్యం ఉంటే విజయం ఎవరినైనా వరిస్తుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. గత నెలలో ప్రకటించిన బ్యాంక్ ఉద్యోగాల ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన దీప్తిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆమె స్వగృహంలో శాలువా, జ్ఞాపికతో కళావేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, బుచ్చిబాబు, వెంకటయ్య, శ్యామ్ సుందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి చూసి ఓటు వేయండి

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, కిష్టాపూర్‌తండా, గోప్లాపూర్ గ్రామాలల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఆర్ఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: గడిచిన 10ఏళ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభివృద్ధి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని నాటవెళ్లి, రామనంతాపురం, విలియంకొండ, నాచారంపేట పర్యటించారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని వడ్డె కాలనీలో మహబుబ్‌నగర్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్ రెడ్డి, ఆవుల బాలకృష్ణ, చాంద్ పాషా, గన్నెపల్లి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నాచారంపేట శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు

సాక్షి, నెట్‌వర్క్: పదేళ్లుగా మాటల గారడీ చేసిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మరోసారి ఓట్ల కోసం మీముందుకు వస్తే వారి మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు చిన్నంబావి మండలంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా, ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి మద్దతు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, శంకర్‌ప్రసాద్, పగిడాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, బీచుపల్లి యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, తౌఫిక్, అను, ఆబిద్, జహంగీర్, వడ్డెమాన్ బిచ్చన్న, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 4గంటలకు కొత్తకోట పట్టణ కేంద్రంలో నిర్వహించే రోడ్‌షో, కార్నర్ మీటింగ్ సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని పట్టణ, మండల అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి యాదవ్ అన్నారు. కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


వనపర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


వనపర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు గెలిపించాలని నాయకులు కోరారు. శుక్రవారం ఆత్మకూర్‌తో పాటు, మండలంలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పురఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

వనపర్తిటౌన్: దేశాన్ని 10ఏళ్లుగా అభివృద్ధిలో బాటలో నడిపించిన బీజేపీకి మరోమారు అవకాశం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, సీతారాములు, ప్రభాకర్, సుమిత్రమ్మ, శ్రీను, రాము సాగర్, కొమ్ము సామేల్, గోర్ల బాబురావు, సుబ్రహ్మణ్యం, నరసింహ, రఘు, అలివేలమ్మ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని వనపర్తి బీజేపి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, వెంకటస్వామి, జగదీశ్వరయ్య, రాముడు, రాజు, మధుకుమార్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: దేశంలో సుస్థిర పాలన కావాలంటే మూడోసారి నరేంద్రమోదీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ అన్నారు. శుక్రవారం గోపల్‌దిన్నె బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించా రు. కార్యక్రమంలో నరేష్ యాదవ్, రాంచందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివసేనారెడ్డికి సన్మానం



పెబ్బేరు రూరల్: టీపీసీసీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డిని శుక్రవారం అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో యువత, విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మాంచారి, ప్రకాష్, హరీష్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నందకిషోర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో అక్రమ నల్లా కనక్షన్లు తొలగించి, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంచాయతీ వాటర్ ట్యాంక్ లోడింగ్, అన్‌లోడింగ్ రికార్డును ఏర్పాటు చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో ఎరుకలి దేవమ్మ మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ శ్రీనివాసులుగౌడ్, మన్యం, మాజీ సర్పంచ్ నాగన్న, దశరథం, సాయన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



చిన్నంబావి: మండలకేంద్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల పనులకు వచ్చేవారు ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా ఎండకు టెంట్లను, ఓఆర్ఎస్ పాకెట్లను అందజేయాలని అధికారులను కోరారు. కొందరు తమకు పనికి తగ్గ డబ్బులు రావటం లేదని, అదే విధంగా కొంత మందికి ఇంటి వద్ద ఉన్నా డబ్బులు చెల్లిస్తున్నారని జెడ్పీటీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడి అక్రమాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరికీ పనికి తగ్గ కూలి వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

బోరు మోటార్ ప్రారంభం



చిన్నంబావి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మండలంలోని బెక్కెంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణాప్రసాద్‌యాదవ్, చిదంబర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే బోరు మోటారు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కురుమూర్తి, వడ్డెమాన్ బిచ్చన్న, మాజీ సర్పంచ్ రంజిత్‌కుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతుల్‌కుమార్‌కు నివాళి

ఆత్మకూర్: ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ అనారోగ్యంతో మృతి చెందడంతో సీపీఐ నాయకులు శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అతుల్‌కుమార్ రైతులు, కూలీల కోసం అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాబర్ట్, ఆర్ఎస్ కుమార్, తిరుపతి, శ్రీహరి, రవీందర్ తదితరులు ఉన్నారు.